## క్లుప్తంగా

### పాఠశాల ప్రహరీ నిర్మాణానికి కృషి



నర్వ: మండలంలోని నాగిరెడ్డిపల్లి పాఠశాల ప్రహరీ ఏర్పాటుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం నాగిరెడ్డిపల్లి పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు.. విద్యార్థుల సామర్థ్యాలను ఆయన స్వయంగా పరిశీలించారు. రహదారికి పక్కన పాఠశాల ఉన్నందున ప్రహరీ లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే మంజూరుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

### రెవెన్యూ గ్రామంగా గుర్తించాలి

మరికల్: మండలంలోని అప్పంపల్లి గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని బీఆర్ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, అనంత్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మంగళవారం సంయుక్త ప్రకటనలో కోరారు. అప్పంపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ భూములు మరికల్, ధన్వాడ, మందిపల్లి, కిష్టాపూర్, రాంకిష్టాయ్యపల్లి, పస్పుల, ఎలిగండ్ల గ్రామాల శివారులో ఉండటంతో ఎదైనా సమస్య వస్తే ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి రెవెన్యూ గ్రామాల విస్తీర్ణం చేపట్టి తమ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ప్రకటించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మాగనూర్: మండలంలోని కొల్పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఉపాధ్యాయులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ మేరకు.. హెచ్ఎం తిమ్మన్న మాట్లాడుతూ ఈ నెల 17నుంచి వచ్చేనెల 02వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నోడల్ అధికారి మురళీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యాయులు హరిక, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక**

మక్తల్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 29న రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థుల ఎంపికైనట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. పట్టణంలోని మినీస్టేడియంలో ఉదయం 9గంటలకు జిల్లాస్థాయి జూనియర్స్ బాలబాలికలకు క్రీడా పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అంబ్రేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత



మక్తల్: పట్టణానికి చెందిన బిల్డర్‌గా పనిచేస్తున్న తిరుపతి,అంబ్రేష్ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందిన సంఘటన విధితమే మంగళవారం విషయం తెలుసుకున్న తోటి కార్మికులు కలిసి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోయాడని, ఇంటి పరిస్థితులు సక్రమంగా గడవకపోవంతో కార్మికులు ఆర్థిక సాయం అందజేశారు.

### తహసీల్దార్‌కు వినతి



మాగనూర్: గ్రామ రెవెన్యూ సహాయకుల తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రంను అందించారు. ఈ మేరకు.. వారు మాట్లాడారు.. గత ప్రభుత్వం గ్రామ సహాయకులను సర్దుబాటు చేసేందుకు 81,85,98ల ప్రకారం ప్రమోషన్ పొందిన వారు తక్కువ సర్వీస్‌తో రిటైర్‌మెంట్ అవుతుండడంతో దాదాపు 2500మంది వీఆర్ఏలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి చేకురడం లేదని వారు ఆరోపించారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వారు కోరారు.

### రైతులను ఆదుకోవాలి

కృష్ణా: మండలంలోని ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు సాగుచేసిన పత్తి, కంది పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ప్రభుత్వం రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకుడు శివరాజ్‌పాటిల్, మాజీ సర్పంచ్ శివప్ప ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలన్నారు.

# వినియోగంలోకి వచ్చేదెన్నడో!



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న క్యాతన్‌పల్లి గ్రామపంచాయతీ భవనం

- నిరుపయోగంగా నూతన జీపీ భవనాలు
- రూ. 3.40కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణాలు
- 15 భవనాలు మంజూరు
- ఆరు నిర్మాణాల పూర్తి
- నిర్మాణ దశలో ఎనిమిది భవనాలు

దామరగిద్ద: గ్రామ పంచాయతీ నూతన భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వం రెండేళ్ల క్రితం నిధులు మంజూరు చేయడంతో అన్ని సదుపాయాలతో కూడిన నూతన పంచాయతీ భవనాల నిర్మాణం పనులను ప్రారంభించారు. నర్సాపూర్, క్యాతన్‌పల్లి, ఉల్లిగుండం, లోకూర్తి, మొగుల్‌మడ్క, దేశాయ్‌పల్లి, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులు పూర్తయ్యాయి. మండలంలో మొత్తం 30 గ్రామ పంచాయతీలుండగా వీటిలో ఇప్పటి వరకు మద్దెల్‌బీడ్, దామరగిద్ద, కాన్‌కుర్తి, విఠలపూర్, అన్నాసాగర్ తదితర గ్రామాల్లో గతంలో నూతన భవనాలు నిర్మించారు. ఇక మిగిలిన దాదాపు 15 గ్రామ పంచాయతీలకు గత ఏడాదిన్నర క్రితం కొత్త



మొగుల్‌మడ్కలోని నూతన గ్రామ పంచాయతీ భవనం

భవనాలు మంజూరు చేశారు. వాటిలో ఒక్కో పంచాయతీకి రూ. 20లక్షలతో గదుల నిర్మాణం తదితర అన్ని సదుపాయాలతో భవనాలు నిర్మాణం చేపట్టేలా నిధులు మంజురయ్యాయి. మంజూరైనా 15జీపీలో భవనాలు రూఫ్‌లేవల్ నిర్మాణాలు చేపట్టగా వీటిలో కందెన్‌పల్లి, చివరి దశలో ఉంది. సుద్దబండ తాండ, యల్సన్‌పల్లి, ఉడ్మల్‌గిద్ద నిర్మాణ దశలోనే ఉన్నాయి.

**బిల్లు రాలేదు..**

గత ఏడాది క్రితం తమ గ్రామానికి కొత్తగా పంచాయతీ భవనం మంజూరైందని సంతోషంతో సొంత నిధులతో పంచాయతీ భవన నిర్మాణం చేపట్టాం. గత ప్రభుత్వ హయాంలోనే ఎమ్మెల్యేచే ప్రారంభోత్సవం చేపట్టి ఉపయోగంలోకి తెచ్చాం. అయినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి బిల్లు చేయలేదు.

– మైపాల్, మాజీ సర్పంచ్, మొగుల్‌మడ్క.

**ఉన్నతాధికారుల దృష్టికి**



ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కొత్త భవనాలకు గత ఏడాదిన్నర క్రితం నిధులు మంజూరు చేశారు. ఒక్కో గ్రామ పంచాయతీకి రూ. 20లక్షల చొప్పున మండలంలోని 15పంచాయతీలకు నిధులు కేటా యించారు. ఇప్పటివరకు 8జీపీ భవనాలు పూర్తిస్థాయిలో పనులు చేపట్టారు. రికార్డుచేసి పంపించిన వాటికి బిల్లులు అందాల్సి ఉంది పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– ధర్మరాజు, పీఆర్ ఏఈ. దామరగిద్ద

**నిర్మాణానికి నోచుకోని భవనాలు..**

మండలంలోని వత్తుగుండ్ల తాండ, సజనాపూర్ గ్రామాలకు మంజూరుచేసిన కొత్త పంచాయతీ భవన నిర్మాణానికి నోచుకోవడం లేదు. నిర్మాణాలు పూర్తిచేసిన వాటికే బిల్లులు అందక ఇబ్బందులు పడుతుండటంతో వీటి పనులు ప్రారంభించేందుకు స్థానికులు ముందుకు రావడం లేదని తెలుస్తుంది.

## పకడ్బందీగా ఓటరు జాబితా రూపకల్పన

కోస్గి: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎలాంటి తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు మరోమారు ఇంటింటికి తిరిగి ఓటరు జాబితాలో మార్పులుచేర్పులు ఉంటే సరిచేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశంలో బీఎల్ఓలతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన యువతి, యువకుల పేర్లు కొత్తగా ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు. గతంలో వచ్చిన అభ్యంతరాలు, సవరణలకు సంబంధించి బీఎల్ఓలు ఇంటింటికి తిరిగి ఫిర్యాదులను పరిష్కారం చేయాలన్నారు. బీఎల్ఓలు నూతన ఓటర్ల జాబితాకు సంబంధించి అర్హులైన వారందరి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని, అవసరమైతే దరఖాస్తుల ఆధారంగా బీఎల్ఓలు క్షేత్ర స్థాయిలో మరోమారు పర్యటించి అవకతవకలకు తావు లేకుండా సరియైన ఓటర్ల జాబితాను తయారు చేయాలని సూచించారు. అనంతరం జాబితా తయారికి సంబంధించి పాటించాల్సిన విధి విధానాలను అధికారులు సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ బుగ్యాసాబ్, మండలంలోని బీఎల్ఓలు పాల్గొన్నారు.



బీఎల్ఓలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## మహిళలకు రక్షణగా షీటీం



మాట్లాడుతున్న షీటీం సిబ్బంది

మద్దూరు: మహిళలు, బాలికల వేధింపుల నుంచి రక్షించడమే షీటీం ప్రధాన లక్ష్యమని షీటీం పోలీసులు బాల్‌రాజ్, చెన్నయ్య సూచించారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలికలు, మహిళల రక్షణ కోసం చేపడుతున్న షీటీం, బాల్యవివాహాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాలికలు, మహిళల సంరక్షణ కోసం ప్రత్యేకంగా నియమించబడ్డ షీటీంలు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆర్టీసీ బస్టాండ్‌లు, విద్యార్థులు రద్దీగా ఉండే ఆటో స్టాండ్‌లతోపాటు ప్రధాన చౌరస్తాలో గస్తీ నిర్వహిస్తారన్నారు. మహిళలు వేధింపుల్ని భరించకుండా పోలీసులకు 100కుగాని, 8712670398 నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్యాస్ సబ్సిడీ పత్రాల పంపిణీ

ఊట్కూరు: మండలంలోని ఓబులాపూర్‌లో మంగళవారం గ్యాస్ సిలిండర్ పథకం ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందించారు. ఈ మేరకు.. మండల కాంగ్రెస్‌నాయకులు, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఇప్పటికే ఉచిత బస్సు, రుణమాఫీ, 200 యూనిట్ల విద్యుత్, 500 రూ.లకే గ్యాస్‌సిలిండర్ వంటి తదితర పథకాలను చేపట్టినట్లు ఆయన తెలిపారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి లక్ష్మి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శివశంకర్, వెంకటప్ప, తిమ్మయ్య, రాఘవేందర్‌గౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

## రహదారి మరమ్మతుకు మోక్షం

దామరగిద్ద: మండల సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటక సరిహద్దు గ్రామాల మీదుగా మెదక్ నుంచి గుర్మిటక్ర్ వరకు వెళ్లేరోడ్డు మరమ్మతుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గుంతలు పడి అధ్వానంగా ఉన్న రోడ్డు విషయమై గతంలో పలుసార్లు మండలంలోని విఠలపూర్, గత్ప, ఉల్లిగుండం గ్రామాల నాయకులు కర్ణాటక రాష్ట్ర ప్రజా ప్రతినిధులకు వివరించారు. కాగా కర్ణాట రాష్ట్ర ప్రభుత్వం రూ. 6 కోట్ల నిధులతో మెదక్ నుంచి గుర్మిట్కల్ సమీపంలోని ఇటిక్యాల వరకు బీటీ రోడ్డు పునర్ నిర్మాణానికి నిధులు మంజూరు కాగా ఆ రాష్ట్ర మంత్రి శరణ్‌ప్రకాష్ పాటిల్ భూమి పూజ చేసి పనులు ప్రారంభిచారు. ఈ సందర్భంగా దామరగిద్ద మండల మాజీ వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, పరుశురాంరెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు.



భూమిపూజ చేస్తున్న కర్ణాటక రాష్ట్ర మంత్రి శరణ్‌ప్రకాష్ రెడ్డి

### సమస్యలు పరిష్కరించరూ!

దామరగిద్ద: పంచాయతీ పాలక వర్గం పదవీ కాలం ముగిసి ఎనిమిది నెలలు గుడుస్తుండటంతో గ్రామ సమస్యల పరిష్కారంపై పట్టించుకునే నాథుడే లేరని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కందెన్‌పల్లి ఎంపీటీసీ అంజిలప్ప డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు ఉన్న నిధులు కేటాయించక పోవడంతో గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు సైతం పరిష్కారం కావడం లేదన్నారు. గ్రామ పంచాయతీల నిధులు మంజూరు చేయాలని, కొత్తపాలక వర్గాల ఎన్నికలు నిర్వహించి, గాడి తప్పిన పంచాయతీ పాలనను గాడిలో పెట్టాలన్నారు.

### బీజేపీ సభ్యత్వ నమోదు



మక్తల్: బీజేపీ పార్టీ పిలుపు మేరకు మండలంలోని సోమేశ్వర్‌బండలో మంగళవారం సభ్యత్వనమోదును బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కర్నిస్వామి ప్రారంభించారు. ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరేవిధంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ కర్నిస్వామి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

### కఠిన చర్యలు తీసుకోవాలి

నారాయణపేట రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగినటువంటి పలు అవకతవకలకు పాల్పడిన బాధితులపై చర్యలు తీసుకోవాలని శ్రీగిరి పీఠం శివానంద స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి పట్టనానికి చేరుకున్న వారు సనాతన హిందూ బంధువులు, సాధు సంతుల సమక్షంలో టిటిడి పాలక మండలి భవనం దగ్గర నిరసన వ్యక్తం చేశారు. లడ్డు వివాదంపై పూర్తి వివరణ తెలియజేయాలన్నారు. అనంతరం దేవస్థాన ఈఓ శ్యామలరావును కలిసి వినతిపత్రం అందించారు.

### విద్యార్థులకు అభినందన

నారాయణపేట రూరల్: మినీస్టేడియం గ్రౌండ్‌లో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి అండర్ 17 కబడ్డీ పోటీల్లో మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలవడం పై మంగళవారం వారిని పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులు, పీఈటీ అజిత్ గౌడ్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ ఖాజా మహబూబ్ ఖాన్, ఉపాధ్యాయ బృందం శాలువాతో సన్మానించి జ్ఞాపిక ను అందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాల మరియు తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ అలీం, శివకుమార్‌గౌడ్, అజిత్ గౌడ్, నారాయణ, ఖదీర్, జాహంగీర్, హరీష్, పవన్, సుదర్శన్, ఖాజా మైనోద్దీన్, సిరాజుద్దీన్, నివేదిత, అపర్ణ, ఖలీదా, ఫరీదా పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయ బృందం

కోస్గి: మండల పరిధిలోని ముశ్రీఫా జెడ్పీఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం పాఠశాలలో సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పూర్వ పాఠశాల ఉపాధ్యాయులతోపాటు బదిలీ, పదోన్నతులపై ఇతర పాఠశాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు సంయుక్తంగా సన్మానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులతో తమకున్న అనుబంధాన్ని విద్యార్థులు మరోమారు గుర్తు చేసుకున్నారు. పాఠశాల జీహెచ్ఎం శేఖరయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ‘బోగస్ కేసు ఉపసంహరించుకోవాలి’



మాట్లాడుతున్న నాగురావు నామాజీ

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 18న జరిగిన ఇరువర్గాల ఘర్షణ విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ప్రముఖ న్యాయవాది, బీజేపీ నాయకులు నాగురావు నామాజీ పోలీసుల తీరుపై మండిపడ్డారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు.. ఈ ఘటనలో అటు ముస్లింలు కానీ ఇటు హిందువులు కానీ ఎలాంటి ఫిర్యాదు చేయకున్నా పోలీసులు అటు 14ఇటు 14మందిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కానీ పోలీసులకు ఒక రాయి తాకినట్లు కానీ దెబ్బలు తగిలినట్లు పేర్కొనకుండా కేసునమోదుచేసి హత్యాయత్నం, మారణహోమం అంటూ సెక్షన్లు పెట్టి రెండు మతాల ప్రజలను భయా బ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రశాంతంగా ఉండే పట్టణంలో పోలీసులు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ బోగస్ కేసును పోలీసులు వెంటనే ఉపసంహరించు కావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మదన్, రఘువీర్ యాదవ్, నందు నామాజీ, మహబూబ్ అలీ తదితరులు ఉన్నారు.

### తాగునీటికి తిప్పలు

మరికల్: మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీతో ఆరురోజుల నుంచి ఎలిగండ్లలో తాగునీటికోసం తిప్పలు పడుతున్నారు. దీంతో గ్రామస్తులు బైక్‌లు, సైకిళ్లపై వ్యవసాయ బోర్ల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. ధన్వాడ మండలం కంసాన్‌పల్లి నుంచి ఎలిగండ్లకు వచ్చే భగీరథ పైపులైన్ లీకేజీ అయిందని, ఒకరోజులో మరమ్మతు పూర్తిచేసి నీటిసరఫరా చేస్తామని చెప్పిన అధికారులు ఆరు రోజులైన పూర్తి చేయకపోవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. త్వరగా పైప్‌లైన్ మరమ్మతు చేయాల్సిన అధికారులు చోద్యం చూడటంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## టిప్పర్లతో ధ్వంసమైన బీటీరోడ్డు

మరికల్: మండలంలోని రాకొండ, పల్లెగడ్డ, మాధవరం, కన్మనూర్ రహదారులపై మొరం, ఇసుక, ఇటుక బట్టీలకు తరలించే బుడిద టిప్పర్లతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. మరమ్మతు చేసిన టిప్పర్ల దాటికి నిల్వడం లేదు. రాత్రి, పగలు తేడా లేకుండా ఏకదాటిగా టిప్పర్ల నడవడంతో రోడ్లు గుంతలుగా మారి ఇతర వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా మారిందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా మొరం, ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్లను పట్టుకుని కేసు నమోదు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ధ్వంసమైన రాకొండ రోడ్డు

### పీఆర్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక



నర్వ: పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా రెండోసారి కుమార్‌లింగంపల్లి పాఠశాలకు చెందిన సూరం వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కమిటీ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా హరీష్, గౌరవ అధ్యక్షుడిగా రాఘవరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లేష్, మహిళా ఉపాధ్యక్షురాలిగా పద్మలత, కార్యదర్శులుగా జనార్దన్, ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడారు.. పీఆర్టీయుకు ఉపాధ్యాయులు మద్దతునిస్తూ మరోసారి ఎన్నుకోవడంపై ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

### బసవ సంస్మరణోత్సవానికి హాజరైన పీఠాధిపతి

మాగనూర్: శ్రీశైల పుణ్యక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన బసవ వేశ్వరుడు సంస్మరణోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేరడగం పీఠాధిపతి శ్రీ పంచమ సిద్ధలింగ మహాస్వామి హాజరై ప్రసంగించారు. బసవేశ్వరుడు సూచించిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు.



### రోడ్డు మరమ్మతు చేపట్టాలి

దామరగిద్ద: మండల కేంద్రం నుంచి సజనాపూర్ గ్రామానికి వెళ్లే బీటీరోడ్డుకు వెంటనే మరమ్మతు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి గోపాల్, అంజిలయ్యగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సజనాపూర్‌లో సీపీఎం 6వ గ్రామ మహాసభను నిర్వహించారు. ఈ మేరకు.. వారు వర్షాలకు కోతకు గురై గుంతలు పడిన రోడ్డు మరమ్మతు చేపట్టక పోవడంతో ఆర్టీసీ బస్సుతోపాటు ప్రైవేట్ వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. అనంతరం సీపీఎం గ్రామ కార్యదర్శిగా షేర్ ఖాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

## మద్యం దుకాణం తరలించాలని ధర్నా

అమరచింత: పట్టణంలోని మరికల్-ఆత్మకూర్ ప్రధాన రహదారి పక్కన ఉన్న వైన్‌షాప్‌ను తరలించాలంటూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ ప్రధాన రహదారి పక్కన వైన్‌షాప్ ఉండటంతో నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే పెట్రోల్ బంక్, చికెన్, మటన్, చేపల దుకాణాలు ఏర్పడటంతో నిత్యం వైన్‌షాప్ పరిసరాలు రద్దీ ఏర్పడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రమేష్‌రెడ్డికి అందించారు. కార్యక్రమంలో విజయ్, అరుణ్, నేపోల్, వినోద్, మహమూద్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ఆత్మకూర్: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. మంగళవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు.

**మున్సిపాలిటీ కేంద్రంలో..**

పట్టణంలోని 1వ వార్డులో కౌన్సిలర్ చెన్నయ్య ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు తదితరులు ఉన్నారు.



అమరచింతలో పరిసరాలు శుభ్రం చేస్తున్న విద్యార్థులు

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సింగంపేటలో చేపడుతున్న స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.